www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 26 మార్చి 2025
5
ఏలూరు

'ధ్రువపత్రాలు పరిశీలించి వివాహాలు చేయాలి'

ఏలూరు అర్బన్ : వివాహాలు నిర్వహించే పురోహితులు, పాస్టర్లు, ఇమాములు తమ వద్దకు వచ్చి వివాహం నిర్వహించమని కోరినా వారి పూర్తి వివరాలు అనగా పేరు చిరునామా, వయసు, ధృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత మాత్రమే వివాహాలు జరిపించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ సంయుక్తంగా బాల్యవివాహాల నిరోధం, బాలలపై అత్యాచారాల నివారణ(పోక్సో) చట్టంపై అవగాహనా సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ తద్వారా ప్రస్తుత సమాజంలో ఎదుర్కొంటున్న బాల్య వివాహ వ్యవస్థను సమూలంగా నిర్మూలించవచ్చని సూచించారు. బాల్య వివాహాలు ఎవరి దృష్టికైనా వచ్చినట్లయితే ఆ వివరాలను దగ్గరలోని సంబంధిత అధికారులకు కాని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు కాని తెలియజేయాలన్నారు.

ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు..!

- ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న కొనుగోలు కేంద్రాలు
- 'పశ్చిమ'లో 6 లక్షల మెట్రిక్ టన్నులు, ఏలూరు జిల్లాలో 2.25 మెట్రిక్ టన్నుల సేకరణకు ఏర్పాట్లు
- గోనె సంచులు, రవాణా ఏర్పాట్లే కీలకం
- కౌలురైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ చేసేనా?
- హమాలీ, రవాణా ఛార్జీలపై రైతుల్లో అవగాహన కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రబీ మాసూళ్లకు సమయం ఆసన్నమైంది. వరి సాగు చివరిదశకు చేరింది. మరో వారం రోజుల్లో రైతులు కోతలు కోసేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై అధికారులు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. రెండు జిల్లాల్లో దాదాపు 3.25 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఏలూరు జిల్లాలో ఏప్రిల్ రెండో తేదీ నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రబీలో మొత్తం 3.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా 2.25 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. దీనికోసం 118 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు 49 లక్షల గోనె సంచులను ఇప్పటికే సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 308 రైతుసేవా కేంద్రాల ద్వారా ఆరు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. పశ్చిమలో ఏప్రిల్ మూడో తేదీ నుంచి ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో గోనె సంచులు సిద్ధం చేసినట్లు అధికారులు చెబుతున్నారు. డెల్టా మండలాల్లో ఎకరాకు 50 బస్తాలకుపైగా దిగుబడి వస్తుంది. మెట్ట ప్రాంతంలో ఎకరాకు 40 బస్తాలోపే వచ్చే అవకాశం ఉంది. గోనె సంచుల కేటాయింపులో దిగుబడిని బట్టి కేటాయించకపోతే డెల్టా మండలాల్లో రైతులు ఇబ్బంది పడే పరిస్థితి రానుంది. గత ప్రభుత్వ హయాంలో ఇదే సమస్య రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఖరీఫ్‌లో దిగుబడి తక్కువ కాబట్టి సమస్య ఉండదు. రబీలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటుంది. అధికారులు అందుకు తగినట్లుగా జాగ్రత్తలు తీసుకుంటారో, లేదో వేచిచూడాలి. ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర ప్రకారం సాధారణ రకం క్వింటాలుకు రూ.2,300, ఎ-గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2,320 చొప్పున కొనుగోలు చేయనున్నారు. రైతులు దళారులకు తక్కువకు అమ్ముకోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే మేలు జరగనుంది. ధాన్యం కొనుగోలులో రైతులు ఎక్కువగా ఎదుర్కొనే సమస్యల్లో గోనె సంచులు, రవాణా ప్రధానంగా ఉంటున్నాయి. గడిచిన ఖరీఫ్‌లో పెద్దగా సమస్యల్లేకుండా ధాన్యం కొనుగోలు సాగింది. రబీలోనూ సంచులు, రవాణా ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కౌలురైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ చేస్తారా..?

ధాన్యం అమ్మకాల్లో వాస్తవ సాగుదారులైన కౌలురైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని తన పేరుమీద కౌలురైతులు అమ్ముకోలేని పరిస్థితి ప్రభుత్వ విధానాల ఫలితంగా దాపురించింది. ఇ-క్రాప్ ప్రక్రియలో భూయజమానుల పేర్లనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో ధాన్యం సైతం భూయజమాని పేరుపైనే అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో ధాన్యం సొమ్ము కౌలురైతుల ఖాతాల్లో పడటం లేదు. భూయజమాని ఖాతాలో జమ చేస్తున్నారు. దీంతో ధాన్యం సొమ్ము జమైన తర్వాత సొమ్ము కోసం కౌలురైతులు భూయజమానుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. కొంతమంది భూయజమానులు ధాన్యం సొమ్ము కౌలురైతులకు ఇవ్వకుండా రోజులు తరబడి కాలయాపన చేస్తున్నారు. దీంతో కౌలురైతులు కూలీలకు, కోత మిషన్లకు కిరాయి ఇచ్చేందుకు సొమ్ము కోసం నానాతంటాలు పడుతున్నారు. పంట పండించిన కౌలురైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. హమాలీలకు సంబంధించిన సొమ్ము కౌలురైతులు పెట్టుకుంటున్నా భూయజమాని ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. హమాలీల సొమ్మును భూయజమానులు కౌలురైతులకు ఇవ్వడం లేదు. దీంతో కౌలురైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. హమాలీ, రవాణా ఛార్జీలపై రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ధాన్యం కొనుగోలులో ప్రతి అంశంపైనా రైతులకు అవగాహన కల్పించి ముందుకు సాగితే అన్నదాతకు మరింత మేలు జరుగుతుంది.

అమరావతిలో జరుగుతున్న కలెక్టర్ల సమావేశంలో మొదటిరోజు మంగళవారం పాల్గొన్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

రేపు ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికలు

అత్తిలి, యలమంచిలిలో ఎంపిపిలు, అత్తిలి, ఏలూరు, కైకలూరుల్లో వైస్ ఎంపిపిల ఎన్నిక

27న ఉదయం పది గంటలకు ప్రక్రియ ప్రారంభం

డిఆర్‌ఒ, జడ్‌పి సిఇఒ సంబంధిత అధికారులతో సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డిఆర్‌ఒ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖాళీగా ఉన్న అత్తిలి, యలమంచిలి మండల పరిషత్ అధ్యక్ష పదవులకు, అత్తిలి, కైకలూరు, ఏలూరు మండలాల ఉపాధ్యక్షుల పదవులకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియ ఈ నెల 27న జరగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ కె.భీమేశ్వరరావు సంబంధిత అధికారులతో మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు. సమావేశంలో సంబంధిత మండలాల ఎంపిడిఒలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి పాల్గొన్నారు. ఎన్నికల రోజు బందోబస్తు, వీడియోగ్రాఫీ ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఉదయం పది గంటలకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనంతరం పరిశీలన, విత్‌డ్రా ప్రక్రియ నడుస్తుంది. ఒంటి గంటకు ఎంపిటిసిలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. చేతులెత్తడం ద్వారా ఎన్నిక నిర్వహించి అధికంగా ఓట్లు వచ్చిన వారిని అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా ప్రకటిస్తారు. ఈ కార్యక్రమానికి ఎంపి, ఎంఎల్‌ఎలు, కోఆప్షన్ సభ్యులు హాజరైనప్పటికీ ఓటింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉండదు. కోరం ఏర్పడకపోతే తర్వాత రోజు 28వ తేదీ 11 గంటలకు మళ్లీ ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తారు. అప్పటికీ కోరం ఏర్పడకపోతే ఎన్నికల కమిషన్‌కు నివేదించి వాయిదా వేస్తారు. ఏలూరు వైస్ ఎంపిపి ఎన్నికపైనే రాజకీయ రగడ నెలకొనే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక్కడ ఎన్నిక జరుగుతుందా లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి.

27న పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నికలు

ఏలూరు జిల్లాలో పది, పశ్చిమలో 17 పంచాయతీల్లో ఎన్నికలు

ఎన్నికల ఏర్పాట్లపై డిఆర్‌ఒ, డిపిఒ సమీక్షా సమావేశం

ఈ నెల 27వతేదీ గురువారం రెండు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు పంచాయతీలకు సంబంధించిన ఉప సర్పంచి ఎన్నికలు జరగనున్నాయి. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, డిపిఒ కె.అనూరాధ సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప సర్పంచి ఎన్నికలు జరగనున్న పంచాయతీలు ఏలూరు జిల్లాలో పది ఉన్నాయి. ముదినేపల్లి మండలం ప్రొద్దువాక, చింతలపూడి మండలం రేచర్ల, మండవల్లి మండలం ముదుత్తాపాడు, లోకుమూడి, పెదవేగి మండలంలో రామశింగవరం, కొండలరావుపాలెం, దెందులూరు మండలంలో దెందులూరు, కలిదిండి మండలంలో భాస్కరరావుపేట, నిడమర్రు మండలంలో ఎనికేపల్లి, కొయ్యలగూడెం మండలంలో అయ్యవారిపురం ఉన్నాయి. నోటిఫికేషన్‌లో నిడమర్రు మండలంలో ఆదవికొలను గ్రామం ఉప సర్పంచి ఎన్నిక నిర్వహించాలని పేర్కొన్నప్పటికీ ఒకవార్డు మెంబర్ స్థానం ఖాళీగా ఉండటంతో ఎన్నికల కమిషన్ ఆ ఎన్నికను నిలిపివేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో 17 గ్రామ పంచాయతీల్లో ఉప సర్పంచి ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో నరసాపురం మండలం మల్లవరం, గొంది, భీమవరం మండలంలో గొల్లవానితిప్ప, గూట్లపాడు, ఎల్‌విఎన్‌పురం, బేతపూడి, అత్తిలి మండలంలో కెఎస్.గట్టు, ఇరగవరం మండలంలో కొత్తపాడు, మొగల్తూరు మండలంలో కెపి పాలెం సౌత్, పేరుపాలెం సౌత్, పాలకొల్లు మండలంలో అగర్తిపాలెం, గోరింటాడ, ఉండి మండలంలో ఎన్‌ఆర్‌పి అగ్రహారం, వీరవాసరం మండలంలో పెర్కిపాలెం, యలమంచిలి మండలంలో అబ్బిరాజుపాలెం, పాలకోడేరు మండలంలో గొరగనమూడి గ్రామాలు ఉన్నాయి. 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నిక ప్రక్రియ ప్రారంభించి వేరుతెత్తే విధానంలో ఆయా పంచాయతీల్లో ఉప సర్పంచి ఎన్నిక నిర్వహిస్తారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు డిఆర్‌ఒ, డిపిఒ ఆదేశాలు జారీ చేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ధర్నా

కొయ్యలగూడెం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ చెల్లన్నదొరకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ మండలంలోని పరింపూడి పేదలకు గత ప్రభుత్వ హయాంలో అచ్యుతాపురం, కిచ్చప్పగూడెం, బైనేరు వంతెన పక్కన ఇళ్ల స్థలాలు కేటాయించారని, అయితే అవి ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. కొన్ని భూములకు సంబంధించి అవి తమవంటూ కొందరు కోర్టుకు వెళ్లారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ భూములను కూటమి ప్రభుత్వం కేటాయించాలని కోరారు. అధిక ధరలు నియంత్రించాలని, కరెంట్ ఛార్జీలను తగ్గించాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించాలని, పేదలందరికీ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, 30 పడకల ప్రభుత్వాసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, ఫైర్ స్టేషన్, రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, ఎన్నికలకు ముందు కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శుక్లబోయిన రాంబాబు, ఎస్.శివ, మరిడియ్య, తమ్మారావు, త్రిమూర్తులు, సుబ్రహ్మణ్యం, వెంకన్న, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రు: నిడమర్రు ఇందిరమ్మ కాలనీలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఇందిరమ్మ కాలనీలో మంగళవారం సిపిఎం బృందం పర్యటించింది. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని పలువురు తెలిపారు. పంట మురుగు బోదె తవ్వించాలని, అంతర్గత రోడ్లు నిర్మించాలని బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ యాత్రలో గవర సత్యనారాయణ, కొన శ్రీను, వెలగలేటి మోహన, కానూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

నిడమర్రులో ప్రజాచైతన్య యాత్ర

రేపు సిఎం పర్యటనను విజయవంతం చేయాలి

పోలవరం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించిన జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 27న పోలవరం ప్రాజెక్టు పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రాజెక్టులోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లను ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 27న పోలవరంలో సిఎం పర్యటన పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఏర్పాట్లపై అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు. పోలవరం ప్రాజెక్ట్ వ్యూపాయింట్ వద్ద హెలీప్యాడ్ ఏర్పాట్లు, ప్రాజెక్ట్ పురోగతి పనులు సందర్శించే ప్రాంతాలను, పార్కింగ్, వివిపి గ్యాలరీ, ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించే సమావేశపుహాలు తదితర ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. విధుల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జెసి సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ డిఎం వి.శ్రీలక్ష్మి, డిఎస్‌ఒ ప్రతాపరెడ్డి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, జిల్లా ఫైరాఫీసర్ సిహెచ్.రత్నబాబు, ఎపిఇపిడిసిల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ఎంఎల్ఎ చంటి, మేయర్ నూర్జహాన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఎండలు తీవ్రమవుతున్న వేళ పాదచారులు, వాహనదారుల దాహార్తి తీర్చేందుకు పెద్దఎత్తున చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ తెలిపారు. ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్, బిర్లా భవన్ సెంటర్లలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ, తాగునీటి చలివేంద్రాలను వారు ఇరువురు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ చంటి మాట్లాడుతూ ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఎండలు తీవ్రరూపం దాల్చాయన్నారు. దీంతో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏడు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అందులో వన్‌టౌన్‌లోని బిర్లాభవన్ సెంటర్, టుటౌన్ ప్రాంతంలోని ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని పోలీస్టేషన్ సమీపంలో ఒకటి మొత్తం రెండు చలివేంద్రాలను ప్రారంభించామన్నారు. ప్రజల వేసవి దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావడం అభినందనీయమని ప్రశంసించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన ప్రాంతాలతోపాటు రద్దీ ప్రాంతాల్లో వాహనదారులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఎంఇ సురేంద్రబాబు, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్.పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్, ఎంఎల్ఎ

కోతులను తరిమేందుకు ప్రణాళిక

ఆర్‌జియూకెటి రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్ :

పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో కోతులను సుదూర ప్రాంతాలకు తరిమేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టనున్నట్లు రాజీవ్‌గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) రిజిస్ట్రార్, క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు. నూజివీడు ట్రిపుల్ ఆయన మంగళవారం మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో కోతుల దాడిలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయన్నారు. గాయాలైన విద్యార్థులకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందించారని, ఆ విద్యార్థులు ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. కోతుల బెడద నిత్యం పెరుగుతున్న మాట వాస్తవమేనని అమరేంద్రకుమార్ చెప్పారు. గతంలో మున్సిపల్ అధికారుల సహకారంతో కోతులను సుదూర ప్రాంతాలకు తరిమినట్లు చెప్పారు. క్యాంపస్‌లో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వన్యప్రాణి సంరక్షణలో భాగంగా కోతులకు ఎటువంటి అపాయం, గాయాలు కలగకుండా కేవలం పెద్ద ధ్వని ప్రదర్శించడం ద్వారా వాటిని సుదూర ప్రాంతాలకు తరిమే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇదే విషయం ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందించినట్లు వివరించారు. త్వరలో శాశ్వత పరిష్కారం కనుక్కుంటామన్నారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి - ఏలూరు

పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల్లో ఇంటిపన్ను, ఖాళీ స్థలాలపై పన్నులు సకాలంలో అనగా మొదటి అర్థసంవత్సరానికి జూన్ నెలాఖరులోపు, రెండవ అర్థసంవత్సరానికి డిసెంబర్ నెలాఖరులోపు పన్ను 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలని ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భాను ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు పురపాలక సంఘాలలో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూలు మెరుగుపరుచుటకు, ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఈనెల 31వ తేదీ ఒకేసారి ఏకమొత్తంలో చెల్లిస్తే వడ్డీ 50 శాతం రాయితీని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జిఒ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు.

పులి సంచారం లేదు : ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

నూజివీడు టౌన్ : అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు భయభ్రాంతులకు గురికావద్దని డివిజన్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ సూచించారు. నూజివీడులో ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇటీవల చాట్రాయి మండలం చిన్నంపేట పరిసర ప్రాంతాలలో పులి సంచారంపై అనేక వదంతులు వ్యాప్తి చెందాయన్నారు. అనేక సామాజిక మాధ్యమాలలో ఇదే అంశం కనిపించడంతో తమ సిబ్బందిని ఆదేశించి బృందాలుగా ఆ ప్రాంతానికి పంపడం జరిగిందన్నారు. తమ సిబ్బంది అణువణువు గాలించి రైతులు చెబుతున్న కాలి ముద్రలను సేకరించడం జరిగినట్లు చెప్పారు. సేకరించిన కాలి ముద్రల ప్రకారం పులికి సంబంధించిన ఆచూకీ ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. ముద్రలు కేవలం పందులు, ఇతర జంతువులకు సంబంధించినవిగా గోచరిస్తున్నాయన్నారు. ముద్రలు ఒకదానిపై ఒకటి ఉన్నట్లు తెలిపారు. వన్యప్రాణి అభయారణ్యానికి ఏమాత్రం సంబంధంలేని నూజివీడు పరిసర ప్రాంతాలలో పులుల సంచారానికి ఎలాంటి ఆస్కారమూ లేదని వివరించారు.

అసత్య ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

తహశీల్దార్ కార్యాలయం ఎదుట కూటమి నాయకుల నిరసన

జీలుగుమిల్లి : మండలంలోని తాటియాకులగూడెం గ్రామంలో ఇటీవల భార్య ఆమె ప్రియుడి చేతిలో హత్యకు గురైన వైసిపి కార్యకర్త గంధం బోస్ హత్య ఉదంతాన్ని కూటమి నాయకులపై నెట్టి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పలువురు కూటమి నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎస్ఐ నవీన్ కుమార్‌కి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న ఎంఎల్ఎ, కూటమి నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం దారుణమని అన్నారు. సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేసిన వారిని అదుపులోకి తీసుకొని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్ఐకు తెలిపినట్లు తెలిపారు. జనసేన, టిడిపి మండలాధ్యక్షులు సుంకవల్లి సాయి, పసుపులేటి రాము పాల్గొన్నారు.

పాఠశాల సముదాయాల అభివృద్ధికి కృషి

నూజివీడు టౌన్ : ప్రస్తుతం ఉన్న పాఠశాలల సముదాయాలను అవసరం మేరకు మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషిచేయనున్నట్లు విద్యాశాఖ కాకినాడ రీజియన్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జెడి) జి.నాగమణి తెలిపారు. విద్యాశాఖ ఆదేశాల ప్రకారం పాఠశాలల సముదాయాల అభివృద్ధి(క్లస్టర్ రీ ఆర్గనైజేషన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి బాయ్స్ హైస్కూల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష కార్యక్రమంలో ఆర్‌జెడి జి.నాగమణి మాట్లాడుతూ పాఠశాలల సముదాయాలలో ఒక్కో ప్రాంతంలో 13 లేదా 15 పాఠశాలలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏరియాల వారీగా అవసరమైన మార్పులు చేర్పులు నిర్వహించి పాఠశాల సముదాయాల అభివృద్ధికి విశేషమైన కృషి జరగవలసిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా రాష్ట్ర విద్యాశాఖ ప్రణాళికాబద్ధంగా ముందడుగులు వేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డివిజనల్ ఉప విద్యాశాఖ అధికారి ఎం.సేవ్య, డిసిసిబి సెక్రటరీ సర్వేశ్వర్, ఎఎస్ఒ రమేష్, ఎంఇఒలు పాల్గొన్నారు.

కోకో గింజలు కొనుగోలు చేసి ఆదుకోండి

అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలి

లింగపాలెంలో కోకో రైతుల ధర్నా

ప్రజాశక్తి - లింగపాలెం

కోకో గింజలు వెంటనే కొనుగోలు చేసి కోకో రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకష్ణ మాట్లాడారు. కోకో గింజలను కంపెనీలు అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలపు పంట (అన్ సీజన్) కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేయడం లేదని, రైతులు వద్ద నిల్వ ఉండిపోవడంతో ఏం చేయాలో అర్థం కాక కోకో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎటువంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు ప్రస్తుతం నాణ్యతా ప్రమాణాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు కిలోకు రూ.700కుపైగా ధర ఉన్నా ఆ ధరకు కొనుగోలు చేయడం లేదన్నారు. నాణ్యతతో కూడిన సీజన్ గింజలను కూడా తగినంతగా కొనుగోలు చేయడం లేదని చెప్పారు. ఇప్పటివరకు లేని గ్రేడింగ్ విధానాన్ని కంపెనీలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. రోజురోజుకీ కంపెనీలు కోకో గింజలకు ధర తగ్గించి వేయడంతో కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతులు తీవ్ర నష్టాలకు గురై అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి అన్ సీజన్, సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకుని కోకో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేసంగి సత్యనారాయణ, మోరంపూడి సుబ్రహ్మణ్యం, భాస్కరరావు, సాయిల రాంబాబు, పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: రైతుల వద్ద ఉన్న అన్‌సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం కోకో రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, ఎపి కోకో రైతుల సంఘం నాయకులు బొబ్బా రమేష్, నిడదవోలు సుబ్బారాయుడు మాట్లాడుతూ ఈ సంవత్సరం తగిన ధర రాక, కంపెనీలు గింజలు కొనుగోలు చేయక కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజలతో పచ్చళ్లు పట్టుకోండి అంటూ కొన్ని కంపెనీల ప్రతినిధులు రైతులను ఎగతాళి చేస్తూ అవమానించడం దారుణమని విమర్శించారు. నెల రోజులుగా రోడ్డెక్కి కోకో రైతులు ఆందోళన చేస్తున్నారని, అయినా కంపెనీల నుండి తగిన స్పందన లేదని అన్నారు. అన్ సీజన్ కోకో గింజలు వెంటనే కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ దుర్గా మహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పర్సా ధర్మరాజు, ఆర్.సుభాష్‌రాజు, మహేశ్వరరావు, ఎం.వీర్రాజు, పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

లింగపాలెంలో..



ద్వారకాతిరుమలలో

ప్రజాశక్తి
www.prajasakti.com

రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయాలి : ఎంపీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి కీలకమైన రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాల సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు మంగళవారం అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదిక సమర్పించారు. భద్రాచలం-కొవ్వూరు బ్రాడ్ గేజ్ లైన్(సత్తుపల్లి మార్గంగా) నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, గుడివాడ జంక్షన్-నూజివీడు-మధిర కొత్త రైల్వేలైన్(నూజివీడు పట్టణం, విస్సన్నపేట మార్గంగా) నిర్మాణం చేయాలని తెలిపారు. నూజివీడు రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిధుల విడుదల, ముఖ్యంగా ప్రయాణీకుల నిరీక్షణ గదులు, మండపాలు, మరుగుదొడ్లు, ఎత్తు లిఫ్టులు, కూర్చునే బెంచీలు, 24 గంటల టికెటింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏలూరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న గేట్లు కారణంగా ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నందున ఎన్‌హెచ్-16పై రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణం, ప్రధాన రైల్వే స్టేషన్లలో కోవిడ్ సమయంలో ఉన్న రైళ్ల హాల్ట్‌లను పునరుద్ధరించడం, ముఖ్యంగా పల్లేవాడ హాల్ట్, నూజివీడు స్టేషన్‌లకు మరింత ఎక్కువ స్టాప్‌లను కేటాయించాలని ఎంపీ మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

వేసవిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ప్రశంసనీయం

కొయ్యలగూడెం : వేసవిలో ప్రజలకు దాహార్తి సమస్యను తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థల కృషి ప్రశంసనీయమని ఎస్ఐ వి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం గణేష్ సెంటర్లో గణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. శ్రీగణపతి యువజన సంఘం చేయూతతో గ్రామానికి టిటిడి కల్యాణ మండపం, ప్రభుత్వ ఎస్‌సి బాలికల హాస్టల్ సమకూర్చగలిగాయని పేర్కొని, యువజన సంఘం సభ్యులను అభినందించారు. నాలుగు నెలల పాటు రక్షిత తాగునీరు దాహార్తిలకు అందజేయడం జరుగుతుందని యువజన సంఘం గౌరవాధ్యక్షులు మట్టా సూర్యచంద్రరావు తెలిపారు. తాడిగడప ఆంజనేయరాజు, జ్యేష్ట రామకృష్ణ, జమ్మి చంద్రం, నీలం దుర్గారావు పాల్గొన్నారు.

పంచాయతీ అశీల వేలం వాయిదా

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం(పరింపూడి) పంచాయతీ అశీల వేలం పాటలు 27వ తేదీకి వాయిదా పడ్డాయి. మంగళవారం కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో సర్పంచి ముప్పిడి విజయకుమారి అధ్యక్షతన ఆశీల వేలంపాటలు నిర్వహించారు. రోజువారి మార్కెట్, వారపు సంతకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూ.4.25 లక్షల చొప్పున రెండిటికి కలిపి రూ.8.50 లక్షలు నిర్ణయించారు. డిపాజిట్‌దారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మించి వేలాన్ని దక్కించుకోవలసి ఉంది. అయితే ప్రభుత్వం నిర్ణయాన్ని మించి పాడటానికి వేలం పాట దారులు రాకపోవడంతో వాయిదా వేయాల్సి వచ్చిందని కార్యదర్శి తెలిపారు. డిపాజిట్ దారులు తక్కువ వేలంలో ఆసీలను దక్కించుకోవడానికి సిండికేట్‌గా వ్యవహరించడం వల్ల ప్రభుత్వం నిర్ణయించిన ధర రాబట్టలేక పోతున్నామని పంచాయతీకి చెందిన ఓ సీనియర్ ఉద్యోగి వ్యాఖ్యానించారు.

నవోదయం 2.0పై ప్రచారం

నూజివీడు టౌన్ : ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ అవులయ్య ఆదేశాల మేరకు మండలంలోని పోతురెడ్డిపల్లి, దేవరగుంట, జంగంగూడెం, గొల్లపల్లి, మీర్జాపురం, మర్రిబందం గ్రామాలలో నాటుసారారహిత ఆంధ్రప్రదేశ్ కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన నవోదయం 2.0 అనే కార్యక్రమంలో భాగంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. పోతురెడ్డిపల్లి, దేవరగుంట, జంగంగూడెం, గొల్లపల్లి, మీర్జాపురం, మర్రిబందం గ్రామాలలో గ్రామ సభలలో సర్పంచి అధ్యక్షతన గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి, ఈ కమిటీల ద్వారా గ్రామాలలో ఎవరైనా నాటుసారాయి తయారు చేసినా, అమ్మినా, రవాణా చేసినా, వారి వివరాలు తెలియజేస్తామన్నారు. పోతురెడ్డిపల్లి, దేవరగుంట, జంగంగూడెం, గొల్లపల్లి, మీర్జాపురం, మర్రిబందం గ్రామాలను నాటు సారాయి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే ఈ గ్రామ కమిటీ లక్ష్యమని నిర్ణయించినట్లుగా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. అనంతరం గ్రామాలలో ప్రచారం చేశారు.

బిజెపి మత విద్వేషాలను రెచ్చగొడుతుంది : సిపిఐ

ద్వారకాతిరుమల: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో ఎన్‌డియే ప్రభుత్వం ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలించి మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య విమర్శించారు. సిపిఐ శత వార్షికోత్సవాల సందర్భంగా మార్చి 23 నుంచి ఏప్రిల్ 14 వరకు సిపిఐ నిర్వహిస్తున్న ప్రచార జాత మంగళవారం సాయంత్రం ద్వారకాతిరుమలలో పర్యటించింది. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ మతోన్మాద చర్యలను ప్రజలందరూ ఐక్యమత్యంగా తిప్పి కొట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార జాతాలో సిపిఐ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఐ నాయకులు గోలిమే బాలయేసు, మాంద్రు బాలరాజు, యడ్లపల్లి రమేష్, పెండ్లి భూషణం, నల్లంటి భద్రయ్య పాల్గొన్నారు.

నేడు జీలుగుమిల్లి మండల సమావేశం

జీలుగుమిల్లి : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 నిమిషాల నుంచి మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి మండలంలోని ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు పురోగతి నివేదికలతో హాజరుకాగలరని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కార్యదర్శులు అందరూ సమావేశానికి హాజరుకావాలని ఆదేశించారు. అనుమతి లేకుండా గైర్హాజరైన వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ : ఎంఎల్ఎ

చింతలపూడి : రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుందని చింతలపూడి నియోజకవర్గం ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ అన్నారు. మండలంలోని చింతలపూడి పట్టణంలో పెద్ద మసీదు ముస్లిం సహోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందుకు ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

చింతలపూడి : వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి హబీబ్ షా తెలిపారు. చింతలపూడి మార్కెట్ యార్డ్‌లో డిఆర్‌డిఎ, వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ భాగం సంయుక్తంగా ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ వార్షిక ప్రణాళిక కన్వర్జెన్సీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతలపూడి ఎడిఎ బి.నాగకుమార్ నవధాన్యాల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలను తెలియజేశారు. చింతలపూడి, లింగపాలెం ఎడిఎలు, ఉద్యాన శాఖ అధికారి పాల్గొన్నారు.

అరబ్‌లో పోలవరం వాసి గుండెపోటుతో మృతి

పోలవరం : పొట్టచేత పట్టుకుని ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లిన పోలవరం గ్రామానికి చెందిన పోలవరం వాసి సోమవారం తెల్లవారుజామున సౌదీ అరేబియా ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందాడు. ఆ సంఘటన కూడా రంజాన్ మాసంలో జరగడం గ్రామంలో ముస్లిం కుటుంబాలలో విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే పోలవరం పంచాయతీ బిసి కాలనీకి చెందిన యూసఫ్‌కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం సౌదీ అరేబియా రియాద్ సిటీ బతహా మురబ్బా ఏరియాలో డ్రైవరుగా పని చేస్తున్నాడు. తెల్లవారుజామున గుండెల్లో మంటగా ఉండడంతో సాటి డ్రైవరు అతనిని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అధికారులు మృతదేహాన్ని స్వదేశం రప్పించడానికి సహాయ సహకారాలందించాలని మృతుని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

చోరీ సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని కురెళ్లగూడెం గ్రామంలో ఈనెల 22వ తేదీన జరిగిన పశువుల దొంగతనం కేసును ఛేదించినట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇద్దరు అంతర్ జిల్లాల దొంగలను పట్టుకొని, చోరీ సరుకు తరలించేందుకు ఉపయోగిస్తున్న మోటార్ వాహనంతో పాటు, రూ.2.50 లక్షల విలువ గల చోరీ సొత్తును స్వాధీనపర్చుకున్నామన్నారు. వారు తెలిపిన వివరాల మేరకు పల్నాడు జిల్లా కల్వకుంట గ్రామానికి చెందిన సూదెనబోయిన నరసయ్య, అదే జిల్లా పిడుగురాళ్లకు చెందిన కుంచపు దుర్గాప్రసాద్ ఈనెల 22వ తేదీన కురెళ్లగూడెం గ్రామంలో రోడ్డు పక్కన షెడ్‌లో గల అదేగ్రామానికి చెందిన పెండ్యాల కిషోర్‌కు చెందిన రెండు గేదెలు, రెండు దూడలను ఈనెల 22వ తేదీ రాత్రి దొంగిలించి తరలించుకుపోయారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్ఐ సుధాకర్ జిల్లా, డివిజనల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, భీమడోలు సిఐయుజె విల్సన్ పర్యవేక్షణలో దర్యాప్తును ప్రారంభించారు. మంగళవారం దొంగిలించిన సరుకును మోటార్ వాహనంలో జాతీయ రహదారి మీదుగా తరలిస్తున్న వాహనంతో పాటు, చోరీ సొత్తును, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో గతంలో నరసయ్యపై ఒక కేసు, దుర్గాప్రసాద్‌పై 12 కేసులు ఇతర ప్రాంతాల్లో నమోదైనట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

బాబోయ్ వీధి కుక్కలు..!

గ్రామాల్లో విచ్చలవిడిగా స్వైర విహారం
వాహనదారులు, పాదాచారులపై దాడి
భయంతో గ్రామస్తులు : పట్టించుకోని అధికారులు

గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని అన్ని గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. వీధి కుక్కల బెడదతో ప్రజలు భయంభయంగా మసులుతున్నారు. గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ ప్రజలపై, వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. వీధి కుక్కల దాడితో నిత్యం మండల వ్యాప్తంగా అనేకమంది క్షతగాత్రులుగా మారుతున్నారు. దీంతో వీధుల్లోకి చిన్నారులు వెళ్లాలంటే భయపడుతూ, తల్లిదండ్రులు కూడా భయపడే పరిస్థితి మండలంలో నెలకొంది. వీధి కుక్కలు గ్రామాల్లోని అంతర్గత రోడ్లపై, రహదారులపై రాకపోకలు సాగించే ప్రజలను, ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తూ వారిపై దాడి చేస్తూ, గాయ పరుస్తున్నాయి. వీధి కుక్కలు ద్విచక్ర వాహనదారుల వెంటపడడంతో కంగారులో బైకులు అదుపుతప్పి ప్రమాదాలకు కూడా గురవుతున్నాయి. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ వీధి కుక్కలు తిరుగుతూ వీటివల్ల కలుగుతున్న ఇబ్బందులపై పంచాయతీ, పాలకవర్గాలకు పలుమార్లు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మండలకేంద్రమైన ముసునూరు గ్రామంలో గతనెల రోజుల క్రితం 9 మందిని వీధి కుక్క పిచ్చికుక్క వలె స్వైరవిహారం చేస్తూ విద్యార్థులు, అంగన్వాడీ ఉద్యోగిని, రోజువారి కూలీ పనిచేసే గ్రామస్థులను అతిగా

గతంలో కుక్క కాటుకు గురైన ఆశా వర్కర్, విద్యార్థిని

కరవడం వల్ల గాయపడిన వారు ఇంజక్షన్ చేయించుకుని, ప్రభుత్వాసుపత్రి వద్ద పడికాపులు పడిన రోజులు ఉన్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. ఊర కుక్కలు స్థానిక పోస్ట్ ఆఫీస్ సెంటర్, చికెన్ షాపుల వద్ద అధికంగా గుంపులుగుంపులుగా చేరి, ద్విచక్ర వాహనదారులపై, మహిళలపై ఎక్కువగా దాడులకు తెగబడుతున్నాయి. చికెన్ షాపుల్లో వ్యర్థ పదార్థాలు ఆ కుక్కలు తిని గొర్రెలు, మేకలు, కోళ్లు, చిన్నారులపై కాటు వేయటానికి కాపుకాస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. కుక్కల నుంచి రక్షించుకునేందుకు వాహనదారులు ప్రయత్నం చేసే సమయంలో వాహనం అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు కోకొల్లలు. ఇప్పటికైనా పంచాయతీ, మండల శాఖ అధికారులు, ఉన్నత శాఖ అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి తప్పించాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, కాళ్ళ మండలం, కాళ్ళకూరు గ్రామం, చిన్నపేట, డోర్ నెం. 6-71 కాపురస్తులు ఓగిరాల రత్నంరాజు, S/o ఓగిరాల సుందరరావు అను నా యొక్క ఒరిజినల్ పాస్‌పోర్ట్ పోయినది. **పాస్‌పోర్ట్ నెం. S0804478.** ది.17-03-2025 తేదిన నా ఒరిజినల్ పాస్‌పోర్టును కవరులో పెట్టుకొని కాళ్ళకూరు గ్రామంలో మా ఇంటి వద్ద నుండి కాళ్ళ వెళ్ళుచుండగా సదరు పాస్‌పోర్ట్ గల కవరు మార్గమధ్యలో జారి పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

ఓగిరాల రత్నంరాజు
S/o. ఓగిరాల సుందరరావు
డోర్ నెం. 6-71, చినపేట, కాళ్ళకూరు,
కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా, A.P.
సెల్: 99893 84333

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి వారి కోర్టులో

H.M.O.P.No. 25/2025

బిట్వీన్:-
యర్రంశెట్టి యామిని ప్రియాంక ...పిటీషనర్
And
యర్రంశెట్టి పృథ్వి,
R/o. D. No. 9-252/1, గాంధీనగర్, చేబ్రోలు,
ఉంగుటూరు మండలం, ఏలూరు జిల్లా. ...రెస్పాండెంట్

పై నెంబరు Divorce O.P లో పై రెస్పాండెంటుకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను ఉద్యేశ్యపూర్వకంగా తీసుకొనక దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు ఆర్డరు పై రెస్పాండెంటు హాజరు నిమిత్తము **ది.08-04-2025వ తేదికి** వాయిదా వేసినారు. కావున సదరు రెస్పాండెంటు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎమ్. రామచంద్రరావు బి.ఎ.ఎల్.ఎల్.బి
తాడేపల్లిగూడెం అడ్వకేట్
తేది:24-03-2025 తాడేపల్లిగూడెం
సెల్: 93955 90074

నవోదయకు రామన్నపాలెం విద్యార్థిని ఎంపిక

జీలుగుమిల్లి : మండలంలోని రామన్నపాలెం ఎంపిపి పాఠశాలకు చెందిన పసుపులేటి లక్ష్మీ ప్రసన్న అనే విద్యార్థిని 2024-2025 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.భవాని శంకర్ తెలిపారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ కూలీ పనులు చేస్తూ పిల్లలను చదివిస్తుండగా నవోదయ ప్రవేశానికి ఎంపికకావడంతో విద్యార్థిని పలువురు అభినందించారు.

లక్ష్మీ ప్రసన్న

సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లక్ష్మణరావు

'రైతులు సంఘ అభివృద్ధికి సహకరించాలి'

టి.నరసాపురం : రైతులు డిపాజిట్లు వేసి సంఘ అభివృద్ధికి సహకరించాలని కె.జగ్గవరం సొసైటీ చైర్‌పర్సన్ తీట్ల లక్ష్మణరావు అన్నారు. మండలంలోని కె.జగ్గవరం సొసైటీ మహా జన సభ లక్ష్మణరావు అధ్యక్షతన మంగళవారం సొసైటీ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలను అందించడానికి కంప్యూటరీకరణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రైతులు సకాలంలో రుణాలు చెల్లించి, కొత్త రుణాలు పొందాలని అన్నారు. సంఘ సిఇఒ తనగాల వీర వెంకయ్య మహాజన సభ ఎజెండాను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ జయ్యవరపు శ్రీరామమూర్తి, సొసైటీ మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, వాసిరెడ్డి మధు, లింగారెడ్డి శ్రీనివాసరావు, వెలిది గంగాధర రావు పాల్గొన్నారు.

జెడ్‌పి పాఠశాలకు ఫర్నీచర్ బహూకరణ

ముసునూరు : మొక్కజొన్న సీడ్ కంపెనీ వారి సౌజన్యంతో గోపవరం జెడ్‌పి పాఠశాలకు కంప్యూటర్లు, బీరువాలు, కుర్చీలు వితరణ చేసినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం ఎల్‌వి‌ఎస్.నాగేంద్రరావు పేర్కొన్నారు. మండలంలోని గోపవరం జెడ్‌పి పాఠశాలలో సుమారు రూ.2 లక్షలు విలువచేసే కంప్యూటర్లు 3, బీరువాలు 3, టేబుల్స్ 4, అడ్వాంటి సీడ్స్ మొక్కజొన్న కంపెనీ సిఎస్‌ఆర్ నిధులతో, కంపెనీ జోనల్ మేనేజర్ సంపత్ ఆధ్వర్యంలో అందజేశారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

28న ఉచిత ఆధార్ క్యాంప్

ఆగిరిపల్లి: మండల పరిధిలోని నెక్కలం, గొల్లగూడెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించే ఉచిత ఆధార్ క్యాంప్‌ను నెక్కలం, గొల్లగూడెంతో పాటు పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ బి.ఆనంద్ బాబు తెలిపారు.

నగర సుందరీకరణకు సమన్వయంతో పనిచేయాలి : ఎంఎల్ఎ

ఏలూరు సిటీ : ఏలూరు నగరాన్ని మరింత సుందరీకరించేందుకు అధికారులు, కార్పొరేటర్లు సమన్వయంతో పనిచేయాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సూచించారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో రీ మోడల్ చేసిన మినీ కాన్ఫరెన్స్ హాల్‌ను ఆయన నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఆధునాతన హంగులతో తీర్చిదిద్దిన మినీ కాన్ఫెరెన్స్ హాల్ సమావేశాలు నిర్వహించుకునేందుకు ఎంతో ఉపయుక్తమన్నారు. కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్ మాట్లాడుతూ అభివృద్ధిపై మేధోమథనం చేసేందుకు ఈ హాల్ ఉపయోగపడుతుందన్నారు. కార్పొరేషన్ అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఎంఇ సురేంద్రబాబు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్‌ఎంఆర్ పెదబాబు, జాల సుమతి, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తుంది'

ముసునూరు : మొక్కజొన్న పంటలో ఎండు తెగులు నివారణా చర్యలు నివారించడానికి తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని మండల వ్యవసాయాధికారులను అక్కిరెడ్డిగూడెం గ్రామ సర్పంచి పులిబళ్ల లక్ష్మీ సత్యనారాయణ కోరారు. మంగళవారం మండలంలోని అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్యధిక రైతులు మొక్కజొన్న పంటలో ఎండు తెగులు వస్తుందని అధికారుల దృష్టికి తీసుకురాగా ఈ విషయంపై మండల వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ మొక్కజొన్న పంట తొలిత దశలో ట్రైకో బర్మావిరిడి ఎకరానికి 5 కేజీలు, ప్రకృతి సంపద ఎరువు 100 కేజీలు పిచికారీ చేసి భూమిపై చల్లినట్టైయితే పంటలో ఎండు తెగులు నివారించవచ్చునని రైతులకు సూచించారు. **భీమడోలు :** పొలం పిలుస్తుంది కార్యక్రమం సేవలను రైతులు వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు యుఆర్.కుమారి కోరారు. కురెళ్లగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పాతూరు రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయాధికారి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు షైలు భాను పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - ఉంగుటూరు

పొరపాట్లు, తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు బూత్ లెవెల్ ఆఫీసర్లదే కీలక బాధ్యత అని ఉంగుటూరు ఎంపిడిఒ గంజిరాజు మనోజ్ అన్నారు. ఉంగుటూరు ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం బిఎల్ఒలతో సమావేశాన్ని ఎన్నికల డిటి పోతురాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మీ వద్ద ఉన్న క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం విఆర్‌ఒలతో కలిసి పరిశీలించి ప్రతిపాదనలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

2 నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



పి.వి.శ్రీనివాసరావు

దీపం-2 పథకంలో ఇప్పటి వరకు ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఒక్కసారి కూడా బుక్ చేసుకోని వినియోగదారులు ఈనెలాఖరులోగా బుక్ చేసుకోవాలని శ్రీభాగ్యలక్ష్మీ ఇండేన్ గ్యాస్ కంపెనీ నిర్వాహకులు పాలడుగు వెంకట శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరులోపు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోకపోతే 3 ఉచిత సిలిండర్లలో ఒక దానిని కోల్పోతారని, ఇప్పటి వరకు ఇకెవైసి చేసుకోని వినియోగదారులు తప్పనిసరిగి ఇకెవైసి చేయించుకోవాలని, ఏ కారణం చేతనైనా ఇప్పటి వరకు మొదటి ఉచిత సిలిండర్ డబ్బులు పడని వినియోగదారులు గ్యాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, కొత్త రేషన్ కార్డు తీసుకుని గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో సంప్రదించవలసిందిగా కోరారు. ఏప్రిల్ నుంచి 2వ ఉచిత సిలిండర్ బుకింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు.

మండల పరిషత్ కార్యాలయము, మండల ప్రజా పరిషత్, నూజివీడు

టెండరు నోటీసు

ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, మండల పరిషత్ కార్యాలయంలో ఈ దిగువ షెడ్యూల్ దాఖలా పనులను నిర్వహించుటకు కాంట్రాక్ట్ పద్ధతిపై ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు పనిచేయబడుటకు గాను ది. 25-03-2025వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం గం॥ 5.00 ల వరకు స్టీల్ టెండర్లు స్వీకరించబడును.

వ.నెం.	పని వివరము	సంఖ్య	పని కాలము
1	శానిటేషన్ వర్క్, సూపర్‌వైజర్ వర్కర్స్, గార్డినర్	3	1-4-2025 నుండి 31-3-2026 వరకు
2	శానిటేషన్ మెటీరియల్ సప్లై	-	1-4-2025 నుండి 31-3-2026 వరకు

కార్యాలయం వారి నోట్: గతంలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. మరియు మండల ప్రజా పరిషత్ కార్యాలయ నిల్వలను బట్టి పేమెంట్ జరుపబడును.

సం/- **ఆరేపల్లి శిరీష, MPP**
మండల పరిషత్ కార్యాలయం
మండల ప్రజా పరిషత్, నూజివీడు

సం/- **MPDO**
మండల పరిషత్ కార్యాలయం
మండల ప్రజా పరిషత్, నూజివీడు

గ్రామపంచాయతీ కార్యాలయము, జీలుగుమిల్లి, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

రి.క. నెం.1/2025 **టెండరు నోటీసు** **తేది.25-3-2025**

ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, జీలుగుమిల్లి గ్రామపంచాయతీకి 2025-2026 సం॥నకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు ఈ దిగువన తెల్పిన వివిధ సేవలు నిర్వహించుటకు మరియు వివిధ రకాల సామాగ్రి సప్లయి చేయుటకు సంబంధించిన సీల్డు టెండర్లు ది. 29-03-2025వ తేదీ ఉదయం 11.00 గంటలకు గ్రామపంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00 లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని వివరం	పోస్టుల సంఖ్య	ధరావత్తు రూ.లలో
1	ట్యాంకు ఆపరేటరు పోస్టులు	04	50/-
2	క్లాప్ మిత్రా	03	50/-
3	క్లాప్ మిత్రా & Shed	01	50/-
4	ఎలక్ట్రీషియన్	01	50/-
5	ప్రజా ఆరోగ్య సామాగ్రి సరఫరా చేయుటకు		100/-
6	వీధి దీపముల విడిభాగాలు సరఫరా చేయుటకు		100/-
7	మంచినీటి సరఫరా సామాన్లు సరఫరా చేయుటకు		100/-
8	స్టేషనరీ మరియు ఆర్టికల్స్ సరఫరా చేయుటకు		100/-

సం/- **పాలడుగుల అశోక్,** పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి - జీలుగుమిల్లి, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

గ్రామపంచాయతీ కార్యాలయము, రాచన్నగూడెం, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

రి.క. నెం.1/2025 **టెండరు నోటీసు** **తేది.25-3-2025**

ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, రాచన్నగూడెం గ్రామపంచాయతీకి 2025-2026 సం॥నకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు ఈ దిగువన తెల్పిన వివిధ సేవలు నిర్వహించుటకు మరియు వివిధ రకాల సామాగ్రి సప్లయి చేయుటకు సంబంధించిన సీల్డు టెండర్లు ది. 28-03-2025వ తేదీ ఉదయం 11.00 గంటలకు గ్రామపంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00 లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని వివరం	పోస్టుల సంఖ్య	ధరావత్తు రూ.లలో
1	ట్యాంకు ఆపరేటరు పోస్టులు	07	50/-
2	క్లాప్ మిత్రా	02	50/-
3	క్లాప్ మిత్రా & Shed	01	50/-
4	ఎలక్ట్రీషియన్	01	50/-
5	ప్రజా ఆరోగ్య సామాగ్రి సరఫరా చేయుటకు		100/-
6	వీధి దీపముల విడిభాగాలు సరఫరా చేయుటకు		100/-
7	మంచినీటి సరఫరా సామాన్లు సరఫరా చేయుటకు		100/-
8	స్టేషనరీ మరియు ఆర్టికల్స్ సరఫరా చేయుటకు		100/-

సం/- **పాలడుగుల అశోక్,** పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి - రాచన్నగూడెం, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

బజాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ పేరుతో డబ్బు వసూలు

8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

బజాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ పేరుతో డబ్బులు వసూలు చేసేందుకు ఓ ముఠా ఏకంగా పోలీసుల అవతారమే ఎత్తింది. అయితే చివరికి పోలీసులు వీరి ఆట కట్టించి వారిని కటకటాలపాలు చేశారు. ఏలూరు నగరంలో ఏలూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డిఎస్‌పి శ్రావణ్ కుమార్ పాల్గొని తెలిపిన వివరాల ప్రకారం సాధారణంగా ఫైనాన్స్ కంపెనీ నుంచి ఫైనాన్స్ తీసుకునే సమయంలో పలు రకాల పత్రాలపై సంతకాలు తీసుకుంటూ ఉంటారు. వారు తిరిగి ఇవ్వకుంటే వాటిని వసూలు చేసేందుకు ఓ ప్రణాళిక ప్రకారం వారు సంతకాలు తీసుకుంటారు. అందుకు భిన్నంగా ఏలూరు నగరంలో బజాజ్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్న సాధారణ ఉద్యోగులు ఏకంగా పోలీసుల పేరును వినియోగిస్తూ పలువురిని బురిడీ కొట్టించారు. చింతలపూడి ప్రాంతంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న మహిళకు ఒక వ్యక్తి ఫోన్ చేసి తాను ఏలూరు నగరంలో సిఐగా పనిచేస్తున్నాడని, తన పేరు నాగరాజని ఆమెకు తెలిపి ఓ వ్యక్తి పేరును ఆమెకు ఫోన్లో చెప్పి అతని వివరాలు, ఫొటోలు, ఆధార్ కార్డులు పూర్తి సమాచారాన్ని తనకు పంపించాలని ఆదేశించాడు. దీంతో ఆమెకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ప్రాంతం నుంచి ఇలా ఫోన్ చేసి ప్రజలను బురిడీ కొట్టించి మోసాలకు పాల్పడుతున్నారని గుర్తించి వెంటనే వారిపై కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ఏలూరు దుగ్గిరాల ప్రాంతానికి చెందిన కలగంటి గోవింద అనే వ్యక్తి బజాజ్ ఫైనాన్స్ లోన్ తీసుకున్నాడు. తదుపరి అతను రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అప్పట్లో కొందరు వ్యక్తులు తమ బజాజ్ ఫైనాన్స్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఇన్సూరెన్స్ సెటిల్మెంట్‌కి సంతకాలు పెట్టాలని పెట్టించుకుని వెళ్లారు. అనంతరం ఐదునెలల తర్వాత మరలా కొందరు వ్యక్తులు అతనికి ఫోన్ చేసి తమ పోలీసుల మనీ తమ డబ్బు తమకు చెల్లించకుంటే ఇంటికి వచ్చి అల్లరి చేస్తామని, ఫొటోలను సోషల్ మీడియాలో పెడతామని బెదిరించారు. దీంతో చేసేదేమీ లేక అతను మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించాడు. ఇలా ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరి దర్యాప్తులో భాగంగా అనేక విషయాలు వెల్లడయ్యాయి. అయితే ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితులుగా చెప్పబడుతున్న ఇద్దరు వ్యక్తులతో పాటు ఏలూరుకు చెందిన ఆరుగురు వ్యక్తుల ముఠాను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈ కేసులో మొత్తంగా 8 మందిని అరెస్ట్ చేసామని తెలిపారు. వీరు కర్ణాటక రాష్ట్రానికి చెందిన సిమ్ములను ఏలూరు నగరంలో ముఠాకు అందించి ఆ సిమ్ముల ద్వారా పలువురికి ఫోన్ చేసి తాము పోలీసులమని, లాయర్లమని, అధికారులమని ఫోన్ చేసి బెదిరింపులకు గురిచేసి, వారి వద్ద నుంచి సొమ్ములను వసూలు చేస్తున్నారు. అయితే ఈ సిమ్ములను ఈ ముఠాకు అందిస్తున్న అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె మండలం రాంపాడు గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీంగా గుర్తించారు. ఈ కేసులో అతనిని ఏ వన్‌గా నిర్ధారించగా ఏలూరు కేంద్రంగా ఈ ముఠాకు ఆశ్రయించిన తిరుపతి జిల్లా తిరుపతి ప్రాంతానికి చెందిన సయ్యద్ మహబూబ్ రియాజ్‌గా రెండో వ్యక్తిని గుర్తించారు. ఈ కేసులో ఇతను ఏ టుగా ఉన్నాడు. కర్ణాటక ప్రాంతానికి చెందిన దొడ్డమని జాఫర్ సాహెబ్ కర్ణాటక నుంచి ఫేక్ సిమ్ములను ఏలూరు నగరానికి కొనితెచ్చి అందిస్తున్నాడు. ఇక ఏలూరు నగరంలో పెదపాడు మండలం పెదపాడు ప్రాంతానికి చెందిన గడ్డం కిషోర్, ఏలూరు నగరంలోని వట్లూరు ప్రాంతానికి చెందిన కొమ్మిన ప్రవీణ్ కుమార్, ఏలూరు సదరన్ స్ట్రీట్‌కు చెందిన మధ్యాహ్నపు వంశీకృష్ణ అలియాస్ వెంకట్, తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన మురడాల అభినవ బాబు, ఏలూరు రామకృష్ణపురానికి చెందిన యనమల భాను ధనుష్‌లు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. అయితే బజాజ్ ఫిన్ కార్పొరేషన్ సంస్థకు ఈ సంస్థ గుర్తింపు పొంది ఉందా? లేదా? అన్న అంశంపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని డిఎస్‌పి తెలిపారు. ఇక మహిళా పోలీసులను ఆశ్రయించి వారి ద్వారా వివరాలు సేకరించినందుకు ప్రయత్నించినందుకు వీరిపై చర్యలకు రంగం సిద్ధం చేశామని తెలిపారు. అంతేకాకుండా ఎవరైనా ఇలా ఫోన్ కాల్స్ ద్వారా బెదిరింపులకు గురి చేస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. ఇటువంటి చర్యలకు ఎవరు పాల్పడినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మీరి వద్దనుంచి మూడు లాప్‌టాప్‌లు, మూడు డెస్క్ టాప్‌లు, 8 సెల్ ఫోన్లు, ఒక వైఫై రోటర్, 19 ఫేక్ సిమ్‌లను స్వాధీనపరుచుకున్నామని ఆయన తెలిపారు. ఈ కేసును చేదించడంలో ప్రతిభ కనబరిచిన ఏలూరు సిసిఎస్‌సిఐ సిహెచ్.రాజశేఖర్, ఏలూరు మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్‌తో పాటు మూడో పట్టణ సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు పాల్గొన్నారు.

పోలీసు శాఖ సహాయం వీరికి ఉందా..

ఈ 8 మంది ముఠా సభ్యులకు పోలీసు శాఖ సహాయం ఉందా అనే ప్రశ్నా ఉత్పన్నమైతే కచ్చితంగా ఉందనే సమాధానం వస్తుంది. ఎందుకంటే సాధారణంగా కేసులు పరిష్కరించే సమయంలో వేరొక ప్రాంతంలో ఉన్న నిందితుల వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు మహిళా పోలీసులను ఆశ్రయించి వారి ద్వారా అక్కడ వారి కార్యకలాపాలను తెలుసుకుంటూ వారి వివరాలను తెలుసుకుంటూ ఉంటారు. ఒక 420 ముఠా కూడా ఇదే తరహాలో మహిళా పోలీసులను ఆశ్రయించి, వారి వివరాలను తెలపాలని చెప్పడంతో కచ్చితంగా దీని వెనక శాఖలో ఎవరిదో హస్తం ఉందని తెలియకనే తెలుస్తుంది. పోలీసులు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, దీని వెనుక పోలీసు శాఖలో నిగూఢమైన రహస్యాలను 420లకు చెప్పి శాఖ పరువు తీస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయము, ములగలంపల్లి, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా

రి.క. నెం.1/2025 **టెండరు నోటీసు** **తేది.25-3-2025**

ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, ములగలంపల్లి గ్రామపంచాయతీకి 2025-2026 సం॥నకు అనగా ది. 01-04-2025 నుండి 31-03-2026 వరకు గల కాలమునకు ఈ దిగువన తెల్పిన వివిధ సేవలు నిర్వహించుటకు మరియు వివిధ రకాల సామాగ్రి సప్లయి చేయుటకు సంబంధించిన సీల్డు టెండర్లు ది. 29-03-2025వ తేదీ ఉదయం 11.00 గంటలకు గ్రామపంచాయతీ నందు టెండరు దాఖలు చేయవలెను. సదరు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం గం॥ 3.00 లకు పంచాయతీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అధికారం ఇవ్వబడిన వారిచే గాని టెండర్లు తెరువబడును.

వ.నెం.	పని వివరం	పోస్టుల సంఖ్య	ధరావత్తు రూ.లలో
1	ట్యాంకు ఆపరేటరు పోస్టులు	04	50/-
2	క్లాప్ మిత్రా	02	50/-
3	క్లాప్ మిత్రా & Shed	01	50/-
4	ఎలక్ట్రీషియన్	01	50/-
5	ప్రజా ఆరోగ్య సామాగ్రి సరఫరా చేయుటకు		100/-
6	వీధి దీపముల విడిభాగాలు సరఫరా చేయుటకు		100/-
7	మంచినీటి సరఫరా సామాన్లు సరఫరా చేయుటకు		100/-
8	స్టేషనరీ మరియు ఆర్టికల్స్ సరఫరా చేయుటకు		100/-

సం/- **కంభంపాటి ప్రియాంక,** పంచాయతి కార్యదర్శి
గ్రామపంచాయతి - ములగలంపల్లి, జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా